



మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసిన జగ్గారెడ్డి, నిర్మల

సంగారెడ్డి రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలో ఓ ప్రైవేటు కార్యక్రమానికి హాజరైయ్యేందుకు వచ్చిన టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌ను టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. సంగారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ అతిథి గృహంలో వారు పలు అంశాలపై చర్చించారు. నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకులను మహేష్‌కుమార్‌గౌడ్‌కు జగ్గారెడ్డి పరిచయం చేశారు.



సంగారెడ్డిలోని ప్రభుత్వ అతిథి గృహంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌తో మాట్లాడుతున్న జగ్గారెడ్డి



టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌ను కలిసిన నిర్మలాజగ్గారెడ్డి



దారెంట పూల తోట

రాజీవ్ రహదారి పూల దారిగా మారింది. సిద్దిపేట నుంచి కరీంనగర్ వెళ్లే రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన చెట్లకు పూసిన పూలు కనువిందు చేస్తున్నాయి. డివైడర్ మధ్యలో, రోడ్డుకు అటు, ఇటు పచ్చదనంతో పాటు ఎర్రటిపూలు వాహనదారులకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. - జిల్లా స్టాఫ్ ఫొటోగ్రాఫర్, మే 11(ఆంధ్రజ్యోతి)



గ్రామ పంచాయతీలకు సరైన ఆర్థిక వనరులు లేక, ఆర్థిక సంఘం నిధులు రాక నిర్వహణ కష్టంగా మారుతోంది. దీంతో పంచాయతీలకు ఆదాయ మార్గాలను సమకూర్చడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందులో భాగంగా చెత్తతో సంపద సృష్టికి శ్రీకారం చుట్టనుంది. గ్రామాల్లో ఇంటింటా చెత్త సేకరణ ద్వారా ఎరువులను తయారీ చేసి, విక్రయించాలని నిర్ణయించారు. ఈ మేరకు నాలుగు రోజుల క్రితం జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఉన్నతాధికారులు పలు సూచనలను చేశారు. మార్గదర్శకాలను సైతం అందజేశారు. దీని కోసం గ్రామ కార్యదర్శులకు ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తేనున్నారు.



ఇటీవల డంపింగ్‌యార్డును పరిశీలించిన జిల్లా పంచాయతీ అధికారి

చెత్తతో సంపద

గ్రామ పంచాయతీలకు ఆదాయం సమకూర్చేలా ఎరువుల తయారీ కేంద్రాలు

- ఇంటింటా సేకరించిన వ్యర్థాల తూకం
- వెయింగ్ యంత్రాల కొనుగోలుకు ఆదేశం
- పంచాయతీ కార్యదర్శులకు ప్రత్యేక యాప్



గ్రామ పంచాయతీలోని సెగ్రిగేషన్ షెడ్డు

దుబ్బాక, మే 11 (ఆంధ్రజ్యోతి) : చెత్తతో సంపద సృష్టికి అన్ని పంచాయతీల్లో ఎరువుల కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలోని 514 గ్రామ పంచాయతీల్లో చెత్త సేకరణలో అవలంభించాల్సిన విధానాలను ఇప్పటికే కార్యదర్శులకు సూచించారు. ప్రత్యేక యాప్ ద్వారా ఎరువుల తయారీ కేంద్రాల పనితీరును పర్యవేక్షించనున్నారు.

జోన్‌ల వారీగా సేకరణ

గ్రామ పంచాయతీల్లో సేకరించే చెత్తను మొదట ఇంటింటా తూకం వేయాల్సి ఉంటుంది. ఇందు కోసం వెయింగ్ మిషన్‌లను కొనుగోలు చేయాల్సిందిగా ఇప్పటికే ఆదేశాలు ఇచ్చారు. గ్రామాలను జనాభా ప్రకారం జోన్‌ల వారీగా విభజించి, చెత్త సేకరణ చేపడుతారు. గ్రామాల్లో రోజూ ఇంటాంటా సుమారు 100 గ్రాముల చెత్తను సేకరించాల్సి ఉంటుంది. సేకరించిన చెత్తను లెక్కించి, యాప్‌లో నమోదు చేయాలి. గ్రామపంచాయతీలో ఇండ్ల వివరాలు, చెత్త సేకరించే విధానం, రోడ్లు, మురికి కాలువలు, దుకాణాలు, మార్కెట్‌లు, మొదలగు సమాచారం అందులో పొందుపర్చాలి.

వినియోగంలోకి డంప్‌యార్డులు

ఇప్పటికే అన్ని గ్రామ పంచాయతీలకు డంపుయార్డులు ఉన్నాయి. అందులో ఎరువుల తయారీకి కావల్సిన సెగ్రిగేషన్ షెడ్డులు కూడా అందుబాటులో ఉన్నాయి. అంతేకాకుండా ప్రతీ పంచాయతీకి చెత్తసేకరణకు ఓ ట్రాక్టర్ సైతం ఉన్నది. రెండేళ్లుగా 15వ కేంద్ర ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోవడం, రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు మూడేళ్ల నుంచి అతీగతీ లేకపోవడంతో పంచాయతీలు నిర్వహణ లోపాలతో కొట్టుమిట్టాడుతున్నాయి. దీంతో డీజిల్ కూడా పోసేందుకు నిధులు లేకపోవడంతో చెత్తసేకరిణ ట్రాక్టర్లు మూలనపడ్డాయి. డంపింగ్‌యార్డులు ఉపయోగంలో లేవు. వాటిని తిరిగి వినియోగంలోకి తెచ్చి, చెత్తను

మిగతా 8వ పేజీలో

మల్బరీ తోటల సాగుతో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌తో సమానంగా ఆదాయం

- జిల్లాలో 1,184 ఎకరాల్లో పంట సాగు
- ఉమ్మడి జిల్లా సెరీకల్చర్ ఏడీఏ నిమ్మ ఇంద్రసేనారెడ్డి



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

తొగుట, మే 11 (ఆంధ్రజ్యోతి): సాఫ్ట్‌వేరు ఇంజనీర్‌తో సమానంగా మల్బరీ తోటలు (పట్టు) సాగుచేస్తున్న రైతులు ఆదాయం పొందుతున్నారని ఉమ్మడి జిల్లా సెరీకల్చర్ సహాయ సంచాలకులు నిమ్మ ఇంద్రసేనారెడ్డి 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో తెలిపారు.

జిల్లాలో ఎన్ని ఎకరాల్లో మల్బరీ సాగు చేస్తున్నారు?

సిద్దిపేట జిల్లాలో 1184 ఎకరాల్లో సుమారు 380 మంది రైతులు పంటను సాగుచేస్తున్నారు. అత్యధికంగా చిన్నకోడూర్‌లో 402 ఎకరాల్లో రైతులు పంట సాగుచేయగా తొగుట, కొండపాక, హుస్నాబాద్, కోహెడ. దుబ్బాక, మిరుదొడ్డితో పాటు 20 మండలాల్లో రైతులు పంటసాగు చేస్తున్నారు.

ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం అందిస్తున్నారా?

మల్బరీ పంట సాగు, గదుల నిర్మాణం కోసం సెంట్రల్ సిల్క్ బోర్డు ద్వారా రూ.4.50 లక్షలు అందిస్తున్నాం. ఇందులో ఓసీ, బీసీలకు 50 శాతం, ఎస్సీ, ఎస్టీలకు 65శాతం సబ్సిడీ లభిస్తుంది.

పెట్టుబడి ఎంతవుతుంది? దిగుబడి ఎలా ఉంటుంది?

మల్బరీ పంటకు చీడపీడ బెడదతో పాటు కోతులు, అడవి పందుల సమస్య ఉండదు. రెండెకరాల్లో పంట సాగు చేసుకుంటే ఏడాది పొడువునా ఎనిమిది నుంచి పది పంటలు తీసుకునే అవకాశ ముంటుంది. ఒక ఎకరాకు కోసం 10 నుంచి 15వేల వరకు ఖర్చు వస్తుంది. రెండెకరాలకు 200 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. క్వింటాల్‌కు మార్కెట్‌లో పట్టుగూళ్ల ధర రూ.500 నుంచి 600 వరకు పలుకుతుంది. నెలకు రైతుకు ఖర్చులు పోను రూ.లక్ష వరకుఆదాయం వస్తుంది. పట్టుగూళ్లను రైతులు విక్రయించడానికి జనగాంతో పాటు హైదరాబాద్‌లోని తిరుమలగిరిలో మార్కెటింగ్ సదుపాయం ఉంది.

66 డ్రంకెన్ డ్రైవ్.. 289 ఎంవీ యాక్ట్ కేసులు

జిల్లా వ్యాప్తంగా ఆకస్మిక వాహనాల తనిఖీలు : సీపీ డాక్టర్ బి.అనురాధ



సిద్దిపేటలో డ్రంకెన్ డ్రైవ్ టెస్ట్ నిర్వహిస్తున్న పోలీసులు

సిద్దిపేట క్రైం, మే 11 (ఆంధ్రజ్యోతి) : ఒకే రోజు 66 డ్రంకెన్ డ్రైవ్ కేసులు, సరైన ధ్రువపత్రాలు లేని, ట్రాఫిక్ నిబంధనలు పాటించని 289 వాహనాలపై ఎంవీ యాక్ట్ ప్రకారం కేసులు నమోదైనట్లు సీపీ డాక్టర్ బి. అనురాధ తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణ, అక్రమ రవాణ నియంత్రణపై జిల్లాలో పలుచోట్ల ఆదివారం సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు వాహన తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తరచుగా, ఆకస్మికంగా వాహన తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, ట్రాఫిక్ నిబంధనలు పాటించి క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి : సీపీ



సిద్దిపేట క్రైం మే 11 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల జిల్లా ప్రజలు, ముఖ్యంగా యువత అప్రమత్తంగా ఉండాలని సీపీ డాక్టర్ అనురాధ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొబైల్ ఫోన్‌కి ఆఫర్లు, డిస్కౌంట్ల పేరుతో వచ్చే లింక్‌ల పట్ల జాగ్రత్తగా ఉండాలని, అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే మెసేజ్‌లకు స్పందించవద్దని తెలిపారు. కొత్త నంబర్ల నుంచి వచ్చే ఏపీకే ఫైల్స్ డౌన్‌లోడ్ చేస్తే మొబైల్ హ్యాక్ అయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. సైబర్ మోసగాళ్లు ట్రాప్ చేయడానికి, విభిన్నమైన తరహాలో, ప్రణాళికతో బయటకు వస్తున్నారని, వాటిని కట్టడి చేయాలంటే ముందస్తు అప్రమత్తత, అవగాహనే ఆయుధమని తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో అపరిచిత వ్యక్తులతో పరిచయం మానుకోవాలని, అపరిచిత వ్యక్తుల మాటల వలలో పడి వ్యక్తిగత విషయాలు, ఫొటోలు అస్సలు ఇవ్వవద్దని, వ్యక్తిగత విషయాల్లో ఎట్టి పరిస్థితుల్లో ఏమరుపాటుగా ఉండవద్దని సూచించారు. సోషల్‌మీడియా అకౌంట్లకి తప్పనిసరిగా ప్రొఫైల్ లాక్ పెట్టుకోవాలని, ఎవరైనా వేధిస్తే తక్షణమే పోలీస్ వారిని సంప్రదించాలని తెలిపారు. సైబర్ నేరాలకు గురైతే వెంటనే గంటలోపు 1930కి కాల్ చేసి సమాచారం ఇవ్వాలని తెలియజేశారు.

నార్కోటిక్ డాగ్స్‌తో తనిఖీలు

సిద్దిపేట క్రైం/గజ్వేల్ రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి): గంజాయి, ఇతర మత్తు పదార్థాల నివారణలో భాగంగా గజ్వేల్, సిద్దిపేట పట్టణ పరిధిలో పలు చోట్ల ఆదివారం పోలీసులు నార్కోటిక్ డాగ్స్‌తో విస్తృతంగా తనిఖీలను చేపట్టారు. పోలీస్ కమిషనర్ అనురాధ ఆదేశానుసారం సిద్దిపేట వన్ టౌన్ సీఐ వాసుదేవరావు ఆధ్వర్యంలో సిద్దిపేట న్యూ, మోడ్రన్ బస్టాండ్, కోమటిచెరువు తదితర ప్రాంతాల్లో, గజ్వేల్ గజ్వేల్ అడిషనల్ ఇన్‌స్పెక్టర్ ముత్యం రాజు ఆధ్వర్యంలో గజ్వేల్ బస్టాండ్, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, హనుమాన్ టెంపుల్ రోడ్డు, పట్టణ శివారు ప్రాంతాల్లో తనిఖీలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మత్తు పదార్థాలను అక్రమంగా రవాణా చేసినా, పాన్ షాపుల్లో, ఇతర దుకాణాల్లో అమ్మితే చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎవరైనా మత్తు పదార్థాలు కలిగి ఉన్నా, విక్రయించినా తెలిస్తే వెంటనే డయల్ 100, తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో టోల్ ఫ్రీ నంబర్ 1908 సమాచారం అందించాలని సూచించారు.



గజ్వేల్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో నార్కోటిక్ డాగ్స్‌తో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

ఎఫ్‌సెట్‌లో మెరిసిన జిల్లా విద్యార్థులు



తాళ్లపల్లి వెంకటేశ్ (22వ ర్యాంక్)

చేర్యాల/సిద్దిపేట కల్చరల్, మే 11 (ఆంధ్రజ్యోతి) : ఎఫ్‌సెట్ ఫలితాలలో జిల్లా విద్యార్థులు ఉత్తమ ర్యాంక్‌లు సాధించారు. కొమురవెల్లి మండలం ఐనాపూర్ గ్రామానికి చెందిన తాళ్లపల్లి వెంకటేశ్ ఇంజనీరింగ్ విభాగంలో రాష్ట్రస్థాయిలో 22వ ర్యాంక్ సాధించారు. 134.93 మార్కులతో ప్రతిభ కనబరిచాడు. అలాగే, ఇటీవల విడుదలైన జేఈఈ మెయిన్స్ ఫలితాలలో ఆలిండియా 171వ ర్యాంక్ సాధించాడు. ఈమేరకు తాళ్లపల్లి వెంకటేశ్‌ను స్థానికులు అభినందించారు. సిద్దిపేట కుషాల్‌నగర్‌కు చెందిన డాక్టర్ శ్రీనివాస్, సంతోషి కుమారుడు రాగి కుషాల్ ఇంజనీరింగ్ విభాగంలో 310వ ర్యాంకు, 105.34 మార్కులు సాధించాడు. అలాగే, పట్టణంలోని మారుతీనగర్‌కు చెందిన దొంతి శ్రీనివాస్‌గౌడ్ కూతురు స్ఫూర్తి ఇంజనీరింగ్ విభాగంలో 525వ ర్యాంకు సాధించింది. పటేల్‌పురకు చెందిన చక్కిలం సాంబయ్య కూతురు చక్కిలం అక్షిత 536వ ర్యాంకు సాధించింది.

మైనర్ల అశ్లీలత సెర్చ్‌పై నిఘా

- డౌన్‌లోడ్, ఫార్వర్డ్ చేస్తే కఠిన చర్యలు
- పోక్సో, ఐటీ యాక్ట్ ప్రకారం కేసు నమోదు
- జిల్లాలో ఇప్పటివరకు ఎనిమిది మందికి రిమాండ్

సిద్దిపేట క్రైం మే 11 (ఆంధ్రజ్యోతి) : మైనర్ల అశ్లీల దృశ్యాలను ఇంటర్‌నెట్‌లో సెర్చ్ చేసి చూస్తున్న వారిపై పోలీసులు పటిష్టమైన నిఘా ఏర్పాటు చేశారు. కేంద్ర హోంశాఖ ఇలాంటి వ్యక్తులపై చర్యలు చేపట్టారు. జిల్లాలో ఈ మధ్యకాలంలో పిల్లల అశ్లీల దృశ్యాలను చూసి, డౌన్‌లోడ్, ఫార్వర్డ్ చేసిన ఎనిమిది మందిపై పోక్సో, ఐటీ యాక్ట్ ప్రకారం పోలీసులు కేసులు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు. సిద్దిపేట వన్‌టౌన్, త్రీ టౌన్, బొంపల్లి, మిరుదొడ్డి, హుస్నాబాద్ పోలీస్‌స్టేషన్‌లు, సైబర్ క్రైమ్ విభాగం పరిధుల్లో ఒక్కొక్కరు, రాజగోపాల్‌పేట పరిధిలో ఇద్దరిపై ఇలాంటి కేసులు నమోదయ్యాయి.

ఐపీ నంబర్ ఆధారంగా..

గూగుల్ సర్చ్ ఇంజన్‌లో చైల్డ్ సెక్సువల్ ఎక్స్‌ప్లాయిటేడివ్ అండ్ అబ్యూజ్ మెటీరియల్ అని టైప్ చేసి అసభ్యకరమైన అశ్లీల దృశ్యాలను, సెల్‌ఫోన్, లాప్టాప్, కంప్యూటర్లలో ఎవరైనా చూసిన, ఫార్వర్డ్ చేసిన అలాంటి వ్యక్తులపై కేంద్ర హోంశాక నిఘా ఏర్పాటు చేసింది. అక్కడి నుంచి వాళ్ల సమాచారం సేకరించి హైదరాబాద్ సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు ఇలాంటి వ్యక్తుల గురించి తెలియజేస్తారు. సంబంధిత ఐపీ నంబర్ల ద్వారా ఎవరు చూశారు.. ఎక్కడ చూశారు.. ఎక్కడికి ఫార్వర్డ్ చేశారు.. అన్న విషయాలను సేకరించి సంబంధిత పోలీసులకు సమాచారం అందిస్తారు. పోలీసులు వారిపై కేసులు నమోదు చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటారు. ఈ విధంగా సిద్దిపేట జిల్లాలో ఇప్పటివరకు 8 మంది వ్యక్తులను అరెస్టు చేసి పోక్సో, ఐటీ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

కఠిన చర్యలు తీసుకుంటాం : సీపీ

పిల్లల నీలిచిత్రాలను, అసభ్యకరమైన, అశ్లీల దృశ్యాలను లాప్టాప్, కంప్యూటర్లు, వాట్సాప్‌లలో ఎవరైనా చూసినా, డౌన్‌లోడ్, ఫార్వర్డ్ చేసినా కఠినమైన చర్యలు తీసుకుంటాం. అలాంటి వ్యక్తులపై కేంద్ర హోంశాఖ నిఘా ఏర్పాటు చేసింది. జిల్లాలో అలాంటి పనులు చేసిన 8 మందిపై ఇప్పటికే కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించాం.

కళలు, సాహిత్యంతో సామాజిక సమస్యల నుంచి విముక్తి



మాట్లాడుతున్న చక్రవర్తి వేణుగోపాల్

సిద్దిపేట కల్చరల్, మే 11 (ఆంధ్రజ్యోతి): కళలు, సాహిత్యం ద్వారా సామాజిక సమస్యల నుంచి విముక్తి లభిస్తుందని సంస్కార భారతి తెలంగాణ రాష్ట్ర సంయుక్త ప్రధాన కార్యదర్శి చక్రవర్తి వేణు గోపాల్ పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో సంస్కార భారతి అనే అఖిల భారతసంస్థ మొదటిసారి సిద్దిపేట జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సిద్దిపేట జిల్లా అధ్యక్షురాలిగా లక్కిరెడ్డి విజయ శుభాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మద్దుల నవీన్ ఎన్నికయ్యారు. అనంతరం నూతన అధ్యక్షురాలు లక్కిరెడ్డి విజయరెడ్డి జిల్లా నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హజరైన సంస్కార భారతి తెలంగాణ రాష్ట్ర సంయుక్త ప్రధాన కార్యదర్శి చక్రవర్తి వేణుగోపాల్ మాట్లాడుతూ.. సంస్కార భారతి అనేది అఖిల భారత సంస్థ అని, కళలు, సాహిత్యం ద్వారా సమాజంలోకి సంస్కారాలను తీసుకొనిపోవడమే దీని లక్ష్యమన్నారు. నేడు సమాజంలో లుప్తమవుతున్న విలువలను కాపాడే విధంగా సంస్కార భారతి కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. సంస్కార భారతి కేవలం కళలు, కళాకారులు మాత్రమే కాకుండా మొత్తం కళా జగత్తుకు సంబంధించి పని చేస్తుందన్నారు. అనంతరం సంస్థ విస్తరణ, కార్య పద్ధతి గురించి సంస్కార భారతి తెలంగాణ ప్రాంత సంఘటన మంత్రి జేపీ నిరంజన్ వివరించారు.

వేసవి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

నంగునూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల కోసం ఏర్పాటుచేసిన వేసవి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని రాజగోపాలపేట పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ గోవర్ధన్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని రాజగోపాలపేట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆధ్వర్యంలో పాలీసెట్ 2025-26 స్వల్పకాల శిక్షణ కార్యక్రమం ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో నైపుణ్యం గల అధ్యాపకులతో వారం పాటు శిక్షణ నిర్వహించినట్టు తెలిపారు. నూతనంగా పాలిటెక్నిక్‌లో చేరే విద్యార్థులకు పాలిసెట్ పరీక్ష యొక్క విధానం, ప్రశ్నల సరళి, పాత ప్రశ్నాపత్రాల యొక్క అభ్యసనం చేయించి నమూనా పరీక్ష నిర్వహించినట్లు తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పదవతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులతో పాటుగా సిద్దిపేట, గజ్వేల్, గంభీరావుపేట నుంచి విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు.



ఏడుపాయలలో వనదుర్గామాతను దర్శించుకుంటున్న భక్తులు



కొమురవెల్లి ఆలయ రాజగోపురప్రాంగణంలో భక్తజన సందోహం

ఆధ్యాత్మిక శోభ

- ఏడుపాయల వనదుర్గామాత, కొమురవెల్లి మల్లన్న ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- పలుచోట్ల జాతరలు ప్రారంభం... ఆకట్టుకున్న ఎడ్లబండ్ల ఊరేగింపు

పాపన్నపేట, మే 11 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధి చెందిన ఏడుపాయల ఆదివారం జనసంద్రంగా మారింది. పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు మంజీరాపాయల్లో స్నానాలు చేసి దుర్గమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు శంకర శర్మ, పార్థివ శర్మ అమ్మవారికి పూజలు చేసి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఒడి బియ్యం పోసి బోనాలు తీసి, భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

అట్టహాసంగా మల్లికార్జునస్వామి జాతర ప్రారంభం

అల్లాదుర్గం, మే 11 (ఆంధ్రజ్యోతి) : అల్లాదుర్గం మండలం గడిపెద్దాపూర్ మల్లికార్జునస్వామి జాతర ఉత్సవాలు ఆదివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. గ్రామంలోని ఎల్లమ్మ దేవతకు, మల్లికార్జునస్వామికి బోనాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. నేడు ఆలయం వద్ద ఎడ్ల బండ్ల ప్రదర్శన నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.



గడిపెద్దాపూర్‌లో ఎల్లమ్మదేవతకు బోనాలను ఊరేగిస్తున్న భక్తులు

శతఘటాభిషేకంతో ముగిసిన జయంతోత్సవాలు

వర్గల్, మే 11 (ఆంధ్రజ్యోతి) : నాచగిరి లక్ష్మీనృసింహస్వామి జయంతోత్సవాలు ఆదివారం శతఘటాభిషేకంతో ముగిశాయి. వేద మంత్రోశ్చరణల నడుమ స్వామివారికి విశేష పంచామృతాభిషేకాలతో పాటు శతఘటాభిషేకం నిర్వహించారు. యజ్ఞాచార్యులు శ్రీమాన్ అచ్యుత రామన్ ఆధ్వర్యంలో మూలమంత్ర హవనం, మహా పూర్ణహుతి చేశారు. ఈ వేడుకలకు భక్తులు విశేషంగా తరలివచ్చారు.

వైభవంగా లక్ష్మీనరసింహ స్వామి కల్యాణం

సిద్దిపేట రూరల్,మే 11(ఆంధ్రజ్యోతి); సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు బండ శ్రీ స్వయంభూ లక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో ఆదివారం నరసింహ జయంతి ఉత్సవాన్ని ఆలయ వంశపారంపర్య అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఉత్సవంలో భాగంగా సుదర్శన నరసింహ హోమం ఘనంగా నిర్వహించారు. హోమం అనంతరం స్వామి వారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. అనంతరం స్థంభోద్భవ సమయంలో అర్చకులు సంప్రదాయబద్ధంగా డోలోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ వంశపారంపర్య అర్చకులు కలకుంట సుమా రంగాచార్యులు హనుమాన్ దీక్షా స్వాములకు భిక్ష, ఉత్సవంలో పాల్గొన్న భక్తులందరికీ అన్నదానం ఏర్పాటు చేశారు.

మల్లన్న ఆలయంలో భక్తుల రద్దీ

చేర్యాల, మే 11 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయ సందర్శనార్థం ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకుని పట్టువస్త్రాలు, బండారి, ఒడి బియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఎల్లమ్మతల్లికి కల్లు, బెల్లంపానకం శాక పెట్టి బోనం నివేదించారు. ఎండతీవ్రత అధికంగా ఉండటంతో మధ్యాహ్నం వేళ భక్తుల రద్దీ మందకొడిగా ఉండగా, సాయంత్రం నుండి రాత్రి వరకు కొనసాగింది. ఇక మల్లన్న ఆలయంలో ఈనెల 15న కానుకలు, ఒడిబియ్యం హుండీలను లెక్కించనున్నట్లు ఈవో అన్నపూర్ణ తెలిపారు.



నాచగిరి క్షేత్రంలో శతఘటాభిషేకం చేస్తున్న వేద పండితులు

కాటేజీ నిర్మాణానికి రూ.15లక్షల విరాళం

ఆలయ పరిధిలో డోనార్ స్కీం ద్వారా రూ.17కోట్ల వ్యయంతో 100గదుల సత్ర భవన నిర్మాణానికి చర్యలు తీసుకున్న నేపథ్యంలో హైదరాబాద్‌కు చెందిన ఉప్పల కోటేశ్వర్‌రావు ఆదివారం ఒక కాటేజీ నిర్మాణం కోసం రూ.15లక్షలు విరాళ చెక్కును ఆదివారం ఈవో అన్నపూర్ణకు అందచేశారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో శ్రీనివాస్, సూపరింటెండెంట్‌లు సురేందర్‌రెడ్డి, శ్రీరాములు, ప్రధానార్చకుడు మహదేవుని మల్లికార్జున్, తదితరులు పాల్గొన్నారు.

తుర్కపల్లి జాతరలో ఆకట్టుకున్న బండ్ల ప్రదర్శన

నారాయణఖేడ్, మే 11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తుర్కపల్లి భూలక్ష్మమ్మ జాతర ఉత్సవాలు ఆదివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. భూలక్ష్మమ్మ తల్లి గారి గ్రామమైన ఎల్గోయి నుంచి ఆ గ్రామస్థులు పెద్దఎత్తున బండ్లను తీసుకొచ్చి తుర్కపల్లి వచ్చి అమ్మవారి గుడి చుట్టూ ప్రదర్శనలు చేయించారు. కామారెడ్డి జిల్లా ధర్మారం, తదితర గ్రామాల నుంచి కూడా భక్తులు బండ్లను తీసుకొచ్చారు. సాయంత్రం నుంచి బండ్ల ప్రదర్శన నిర్వహించారు. రాత్రి బోనాల ప్రదర్శన అట్టహాసంగా చేపట్టారు. భూలక్ష్మమ్మను దర్శించుకోవడానికి దూర ప్రాంతాల నుంచి అనేక మంది ఉదయం నుంచే తరలిరావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. ఉత్సవాలను పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ ఉత్సవాల్లో దాదాపు వందకుపైగా బండ్లతో ప్రదర్శన నిర్వహించారు. జాతర ఉత్సవాలను పురస్కరించుకుని భక్తులు పొర్లుడు దండాలు, అన్నదానం, తదితర మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో తుర్కపల్లి, ఎల్గోయి గ్రామాలకు చెందిన ప్రముఖులు, యువకులు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అవసరమైన అన్ని ఏర్పాటు చేపట్టారు. కాగా జాతర సందర్భంగా భూలక్ష్మమ్మ తల్లిని స్థానిక ఎమ్మెల్యే సంజీవరెడ్డి, తదితరులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. జాతరలో చిన్నారులను ఆకట్టుకునే విధంగా వివిధ రకాల ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. నారాయణఖేడ్ పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేపట్టారు.

రేణుకా ఎల్లమ్మ జాతరకు వేళాయే

- నేటి నుంచి నెల రోజుల పాటు...
- జాతరకు ఏర్పాట్లు పూర్తి

హుస్నాబాద్. మే 11 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ రేణుకా ఎల్లమ్మ జాతర సోమవారం నుంచి ప్రారంభంకానుంది. యేటా వైశాఖ మాసం పౌర్ణమి నుంచి ఈ జాతర ప్రారంభమై నెల రోజుల పాటు అంగరంగ వైభవంగా జరుగుతుంది. ఈ నెల రోజుల కాలంలో లక్షలాది మంది భక్తులు పిల్ల పాపలతో వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు సమర్పించుకుంటారు. ఇక హుస్నాబాద్ రేణుకా ఎల్లమ్మ విగ్రహం దాదాపు 20 అడుగుల ఎత్తులో గంభీర్యంగా ఉంటుంది. కాకతీయుల కాలంలో రుద్రమదేవి ఇక్కడ చెరువు నిర్మించినప్పుడు ఈ ఎల్లమ్మ గుడిని నిర్మించినట్లు చెబుతారు. హుస్నాబాద్ ప్రాంతంలో ఈ పౌర్ణమిని ఎల్లమ్మ పౌర్ణమిగా ప్రమాణికంగా తీసుకొని కాలగణన చేస్తారు. బమ్మెర పోతన్న, సర్వాయి పాపన్నలాంటి ఎందరో మహానీయులు దర్శించినట్లు చరిత్ర కారులు చెబుతారు.



ఎల్లమ్మ పౌర్ణమి రోజైన సోమవారం ఉదయం జాతర సిద్దోగంతో ప్రారంభమవుతుంది. ఎల్లమ్మ దేవిని స్థుతిస్తూ ఆమె చరిత్రను పంబాల పూజారులు ఆటపాటల ద్వారా వివరిస్తారు. దాదాపు 6గంటల పాటు జరిగే ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు వేలాది మంది భక్తులు వస్తుంటారు. ఈ జాతరకు హుస్నాబాద్ చుట్టు పక్కల గ్రామాల నుంచే కాకుండా మహారాష్ట్రలోని చంద్రాపూర్, షోలాపూర్, బీదర్, హైదరాబాద్, నిజామాబాద్, జనగామ, మెదక్, సంగారెడ్డి, వరంగల్, కరీంనగర్, జగిత్యాల,పెద్దపల్లి, భువనగిరి జిల్లాల నుంచి వేలాది మంది భక్తులు హాజరై మొక్కులు సమర్పించుకుంటారు. ప్రతి ఆది, మంగళవారాల్లో మాత్రం ఎక్కువ సంఖ్యలో భక్తులు మొక్కులు సమర్పించుకుంటారు. రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జాతర ఏర్పాట్లపై ఇప్పటికే అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. దేవాలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. మూత్రశాలలు, మంచినీటి కోసం మినరల్ వాటర్ ప్లాంట్‌తో పాటు. వాటర్ ట్యాంకులు, చలువ పందిల్లు వేయిస్తున్నారు. ఆలయ ప్రాంగణంలో హెల్త్ క్యాంపు, పోలీసులతో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.



ఆలయ ఆవరణలో భక్తులు

క్రైం కార్నర్



అడవి దుప్పి కళేబరాన్ని పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారులు

దుప్పిని చంపితిన్న చిరుత

● కాత్రియాల తండా శివారులో ఘటన

రామాయంపేట, మే 11 (ఆంధ్రజ్యోతి) : చిరుత దుప్పిని చంపితిన్న ఘటన మెదక్ జిల్లా రామాయంపేట మండల పరిధి కాత్రియాల తండా శివారులో ఆదివారం చోటుచేసుకున్నది. వివరాలు ఇలా ఉన్నాయి. చిరుత రెండు కూనలను వెంటేసుకొని తండా ఆనుకొని సంచరిస్తుండగా పొలాల్లోకి వెళ్తున్న రైతులు గమనించారు. వెంటనే అందరూ కలిసి దాన్ని తరమటంతో అడవిలోకి పారిపోయింది. అనంతరం ఆ ప్రాంతంలో దుప్పి కళేబరాన్ని గుర్తించి రైతులు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలికి చేరుకుని చిరుత ఆనవాళ్లను గుర్తించారు. అనంతరం దుప్పి కళేబరానికి పోస్టుమార్టం చేసి ఖననం చేశారు. రైతులు రాత్రి వేళల్లో పొలం పనులకు వెళ్లొద్దంటూ అధికారులు సూచించారు.

వారం రోజులుగా సంచారం..

చిన్నపిల్లలను వెంటేసుకొని చిరుత వారం రోజులుగా తమ నివాసాలకు దగ్గరలోనే సంచరిస్తుందని గిరిజనులు ఆందోళన వ్యక్తం చేశారు. వారం క్రితం మండలంలోని కోనాపూర్ చిన్నతండాలోనూ చిరుత కనిపించిందని తెలిపారు. అధికారులు వీలైనంత తొందరలో చిరుత బంధించి తమకు రక్షణ కల్పించాలని వారు కోరారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరి మృతి

● మరొకరి పరిస్థితి విషమం



మృతి చెందిన శేఖర్

పాపన్నపేట, మే 11 (ఆంధ్రజ్యోతి) : రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఒకరు చనిపోగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పాపన్నపేట ఎస్‌ఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కుర్తివాడ గ్రామానికి చెందిన కర్రెల శేఖర్(60) నిత్యం హనుమాన్ ఆలయం వద్ద పరిసరాలు శుభ్రం చేస్తుంటాడు. ఆదివారం టీవీఎస్ మోపెడ్‌పై కుర్తివాడ నుంచి పాపన్నపేట వైపు మళ్లుతుండగా మిన్పూర్ గ్రామం నుంచి మెదక్ వైపు వెళ్తున్న బైక్ ఢీ కొట్టింది. దీంతో కర్రెల శేఖర్, బైక్‌పై ఉన్న కిష్టయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వారిని మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కర్రెల శేఖర్ మృతి చెందగా, తీవ్ర గాయాల పాలైన కిష్టయ్యను మెదక్ లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి ఇద్దరు భార్యలు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.

బైక్ అదుపుతప్పి యువకుడు..



ప్రవీణ్ మృతదేహం

చేగుంట, మే 11 (ఆంధ్రజ్యోతి) : బైకు అదుపు తప్పి యువకుడు మృతి చెందాడు. చేగుంట ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి కథనం ప్రకారం రామాయంపేట మండలం దంతేపల్లి గ్రామానికి చెందిన కేసరి ప్రవీణ్ (25) తమ బంధువులు కర్నాంపల్లి రేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన విందుకు హాజరయ్యాడు. తిరిగి వెళ్తుండగా చిన్నశివనూర్ గ్రామ శివారులోని చేగుంట గజ్వేల్ రహదారిపై బైక్ అదుపుతప్పి కిందపడడంతో ప్రవీణ్ అక్కడికక్కడే మృతి చెందాడు.

విద్యుదాఘాతంతో బాలుడు..


హవేళిఘణపూర్, మే11 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో బాలుడు మృతి చెందిన ఘటన మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. లింగ్సాన్‌పల్లి తండాకు చెందిన దరావత్ మోహన్ కుమారుడు రీతు (10) పాఠశాలలకు వేసవి సెలవులు రావడంతో ఇంటివద్ద తల్లిదండ్రులతో కలిసి ఉంటున్నాడు. ఈ క్రమంలో ఆదివారం దాబా పైకి ఎక్కి స్లాబ్‌కున్న ఇనుప చువ్వలను పట్టుకోవడంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడిక్కడే మృతి చెందాడు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

చేగుంట, మే 11(ఆంధ్రజ్యోతి): నార్సింగ్ మండలం నర్సంపల్లి అటవీ ప్రాంతంలో ఆదివారం తునికాకు సేకరణకు వెళ్లిన గ్రామస్థులకు గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కనిపించింది. ఈ విషయమై గ్రామస్థులు నర్సింగ్ పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకొని పరిశీలించగా మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి స్థితిలో ఉండడంతో శవ పంచనామా నిర్వహించారు. సుమారు 50 నుంచి 60 సంవత్సరాలు వయసు ఉంటుందని, సుమారు నెల క్రితం మృతి చెంది ఉంటారని పోలీసులు తెలిపారు.

ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా?

రిజర్వాయర్ల వద్ద తరచూ ప్రమాదాలు



మంజీరా రిజర్వాయర్ వద్ద జలకాలాడుతున్న యువకుడు

● నీటిలో కలుస్తున్న ప్రాణాలు
● విషాదం నింపుతున్న విహార యాత్రలు
● జాగ్రత్త చర్యలు చేపట్టని అధికారులు
● పర్యాటక కేంద్రాల్లో వసతులు కరువు



మంజీరా తీరాన రీల్స్ తీస్తున్న యువకులు

సంగారెడ్డి రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి) : ఆహ్లాదం కోసం రిజర్వాయర్ల పర్యటనకు వెళ్లే వారి కుటుంబాల్లో విషాద ఛాయలు అలుముకుంటున్నాయి. రిజర్వాయర్ల వద్ద అధికారులు ఎలాంటి జాగ్రత్త చర్యలు చేపట్టకపోవడంతోనే తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయనే విమర్శలు ఉన్నాయి. సంగారెడ్డి మండలం కల్పగూర్ గ్రామ సమీపంలోని మంజీరా బ్యారేజీకి సంగారెడ్డి చుట్టుపక్కల గ్రామాల నుంచే కాకుండా హైదరాబాద్, కర్నాటక, బీదర్, మహారాష్ట్ర నుంచి సందర్శకులు వస్తుంటారు. నీటిలో ఈత కొడుతూ, సెల్ఫీలు దిగుతూ సందడి చేస్తుంటారు. అదేవిధంగా మరికొందరు రీల్స్ చేసేందుకు నీటి ప్రవాహం వరకు వెళ్లడం వల్ల ప్రమాదాలకు గురై నదిలో కొట్టుకుపోయి మృత్యువాత పడిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. వారం రోజుల కాలంలో సిద్దిపేట జిల్లా రంగనాయక్‌సాగర్ రిజర్వాయర్‌కు వచ్చిన రెండు కుటుంబాలు ఈత కొడుతున్న క్రమంలో ఇద్దరు నీట మునిగి చనిపోయిన ఘటన మనందరికీ తెలిసిందే. వేసవి సెలవులు కావడంతో సింగూరు బ్యారేజీ, సంగారెడ్డి పరిధిలోని మంజీరా బ్యారేజీలకు పర్యాటకులు భారీగా వస్తున్నారు. అయినా రిజర్వాయర్ల వద్ద అధికారులు సీసీ కెమెరాలు, ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శమని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం పర్యాటక కేంద్రాల వద్ద ముదస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని పర్యాటకులు కోరుతున్నారు.

అరకొర సౌకర్యాలు..

ఓ పక్క ప్రభుత్వం పర్యాటక కేంద్రాలను అభివృద్ధి చేయాలని చెబుతున్నప్పటికీ ఆ దిశగా అడుగులు పడడం లేదన వాదనలు వినిపిస్తున్నాయి. అరకొర వసతులు ఉండడంతో పర్యాటకులు ఇబ్బందులకు గురవుతున్నారు. సుదూరు ప్రాంతాల నుంచి వచ్చేవారు తమ కుటుంబ సభ్యులతో ఉదయం నుంచి సాయంత్రం సేద తీరుదామని అనుకున్నా సరైన సౌకర్యాలు లేక మధ్యలోనే వెళ్లిపోతున్నారు. సదుపాయాలు కల్పిస్తే సందర్శకుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

సౌకర్యాలు కల్పించాలి



వేసవి సెలవులు ఉన్నందున కుటుంబ సభ్యులతో సరదాగా గడిపేందుకు మంజీరా బ్యారేజీకి వచ్చాం. పర్యాటకుల కోసం ఏవైనా తినుబండరాలు దొరికేలా ఏర్పాటు చేస్తే బాగుంటుంది. పిల్లలతో కలిసి బోటు షికారు చేసేలా అందుబాటులో తేవాలి. అనుకున్న విధంగా ఇక్కడ సౌకర్యాలు లేవు.

- బోగుడ అనిత, సంగారెడ్డి

జాగ్రత్త చర్యలు చేపట్టాలి



పర్యాటక కేంద్రాలైన సింగూరు, మంజీరా బ్యారేజీల వద్ద ప్రమాదాలు జరగకుండా అధికారులు జాగ్రత్త చర్యలు చేపట్టాలి. రిజర్వాయర్ల వద్ద ప్రమాదాలు జరగకుండా సీసీ కెమెరాలు, సూచిక బోర్డులు ఏర్పాటు చేసి గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలి.

-జీ.సాయిలు, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు

రాముడు ప్రపంచానికే ఆదర్శం

● పహల్గాం కన్నీటికి సైనికులు బదులు తీర్చుకుంటారు
● మెదక్ ఎంపీ రఘునందన్‌రావు



ఎంపీ రఘునందన్ రావును సన్మానిస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ రమణాచారి

నంగునూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): అన్నదమ్ముల అనుబంధానికి శ్రీరాముడు ఆదర్శమని మెదక్ పార్లమెంట్ సభ్యుడు రఘునందన్‌రావు అన్నారు. నంగునూరు మండలం నర్మెటలో సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం ఆయన స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో శ్రీరాముడు అడవికి వెళ్తే తమ్ముడు ఆయన వెంట నడిచారని, సీతమ్మ తల్లి కన్నీరు పెడితే రామరాజ్యం కోసం అరణ్యవాసం చేసిన శ్రీరాముడు ఎంతో ఆదర్శమన్నారు. ఈరోజు ఆడబిడ్డల కన్నీటికి కారణమైన సిందూరం తుడ్చివేస్తే దేశమంతా సైనికుల వైపు నిలిచి పాకిస్థాన్ ముష్కరులను తూర్పి పెట్టేందుకు మద్దతు పలికిందన్నారు. అంతకుముందు ఎంపీ రఘునందన్ రావుకు పూర్ణకుంభంతో వేదపండితులు స్వాగతం పలికారు. అనంతరం ఎంపీ రఘునందన్‌ను ఆలయ కమిటీ చైర్మన్ రమణాచారి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెస్‌ఎఫ్ జాతీయ నాయకులు లింగంపల్లి శ్రీనివాస్, ఆలయ కమిటీ చైర్మన్ రాళ్ల బండి రమణాచారి, బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, నాయకులు తిరుపతి రెడ్డి, యాదమల్లు, పప్పు సురేందర్, కలకుంట్ల స్వామి, సింహ కిషోర్, నార్లపురం ఎల్లయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

19 నుంచి ఇంట్రా డిస్ట్రిక్ట్ లీగ్ మ్యాచ్‌లు

● 13 నుంచి జట్ల ఎంపికలు

సంగారెడ్డి అర్బన్, మే 11(ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 19 నుంచి ఉమ్మడి మెదక్ జిల్లాలో అండర్-25 ఇంట్రా డిస్ట్రిక్ట్ క్రికెట్ లీగ్ మ్యాచ్‌లు జరగనున్నాయని మెదక్ క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎ.రాజేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించి లీగ్ మ్యాచ్‌లలో పాల్గొనే రెండు జట్ల ఎంపికలు నూతన జిల్లాల వారీగా జరగనున్నాయని పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లాకు సంబంధించి ఈ నెల 13న సంగారెడ్డి జూబ్లిక్లబ్ ప్రాంగణంలోని ఎం.ఎస్. అకాడమీలో ఎంపిక జరగనున్నట్లు తెలిపారు. అలాగే 14 న మెదక్‌లోని ఇందిరాగాంధీ స్టేడియంలో, 16న సిద్దిపేటలోని జయశంకర్ మినిస్టేడియంలో జరుగుతాయని తెలిపారు. క్రీడాకారులు ఉదయం 10 గంటల వరకు ఆయా ప్రాంతాలకు ఒరిజినల్ ఆధార్‌కార్డు, బర్త్ సర్టిఫికెట్, రెండు ఫోటోలతో హాజరుకావాలని సూచించారు.

ఉగ్రవాదాన్ని తరిమికొడదాం

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి

బెజ్జంకి, మే 11 (ఆంధ్రజ్యోతి) : దేశంలో ఉగ్రవాదాన్ని సహించేది లేదని, కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు సీపీఐ పూర్తి మద్దతు తెలిపినట్లు సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి తెలిపారు సిద్దిపేట జిల్లా బెజ్జంకిలో ఆదివారం నిర్వహించిన మండల 13వ మహాసభకు జిల్లా కార్యదర్శి మంద పవన్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ జెండాను ఎగురవేశారు. ఉగ్రదాడిలో మృతి చెందిన వీర జవాన్లు, పర్యాటకులకు నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ సరిహద్దు వెంబడి పాకిస్థాన్ దుశ్చర్యలకు పాల్పడుతుందన్నారు. భారతదేశం సువిశాలమైనదని, జమ్మూ కాశ్మీర్‌కు వచ్చిన పర్యాటకులపై ఉగ్రవాదులు కాల్పులకు పాల్పడితే నిఘా వర్గాలు ఏం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆపరేషన్ సిందూర్‌తో పాక్ ఉగ్రదాడిని సమర్థవంతంగా ఎదుర్కొంటున్న సైనికులకు వందనాలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక కర్షక విధానాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తుందన్నారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హమీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పై సీపీఐ పార్టీ పోరాటం చేస్తుందన్నారు. ఈ నెల 20న చేపట్టే సార్వత్రిక సమ్మెను విజవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకట్‌రెడ్డి, మండల కార్యదర్శి రూపేష్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మధు, మహేష్, చరణ్, బాలమల్లు, సీపీఐ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



పార్టీ జెండాను ఎగురవేస్తున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

మహిళ ప్రాణం తీసిన వాటర్ హీటర్



భాగ్య(ఫైల్)

పాపన్నపేట, మే 11 (ఆంధ్రజ్యోతి) : వాటర్ హీటర్ షాక్ తగిలి మహిళ మృతిచెందిన సంఘటన మెదక్ జిల్లా మండల కేంద్రమైన పాపన్నపేటలో చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన బెస్త భాగ్య, భూపతి దంపతులకు ఇద్దరు కూతుళ్లు. ఆదివారం ఉదయం భర్త చేపలు పట్టేందుకు నదికి వెళ్లగా.. సెలవులు ఉండడంతో పిల్లలు అమ్మమ్మ వాళ్ల ఇంటికి వెళ్లారు. భాగ్య(36) స్నానం చేసేందుకు బకెట్‌లో వాటర్ హీటర్ పెట్టింది. మరిచిపోయి నీళ్లు వేడి అయ్యాయో.. లేవోనని చెయ్యి అందులో పెట్టింది. దీంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందింది. ఇంటికి వచ్చిన భర్త బకెట్ వద్ద విగత జీవిగా పడి ఉన్న భార్యను చూసి చుట్టుపక్కల వారిని పిలిచి, లేపే ప్రయత్నం చేశాడు. కాగా అప్పటికే భాగ్య మృతిచెందిందని స్థానికులు తెలిపారు. ఈ విషయమై స్థానిక ఎస్‌ఐ శ్రీనివాస్‌గౌడ్‌ను వివరణ కోరగా.. తమకు ఫిర్యాదు రాలేదని చెప్పారు.

తాళం వేసిన ఇళ్లే టార్గెట్

ఇళ్ల తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడుతున్న దొంగలు

తగిన జాగ్రత్తలు తప్పనిసరంటున్న పోలీసులు

సిద్దిపేట క్రైం, మే 11 (ఆంధ్రజ్యోతి): వేసవిలో విద్యాసంస్థలకు సెలవులు ఉండడంతో పలువురు ఇంటికి తాళం వేసి కుటుంబ సమేతంగా విహారయాత్రలు, పుణ్యక్షేత్రాలు, తమ స్వగ్రామాలకు వెళ్తుంటారు. ఇదే అదునుగా భావిస్తున్న దొంగలు తాళం వేసిన ఇళ్లను టార్గెట్‌గా చేసుకుని వరుస చోరీలకు పాల్పడుతున్నారు. ఈ మధ్యకాలంలో సిద్దిపేట పట్టణంలోని టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో శంకర్‌నగర్‌లో తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి బంగారం వెండి ఆభరణాలతో పాటు, నగదును దోచుకెళ్లారు. వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పట్ట పగలే తాళం వేసిన ఇంటిని లూటీ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటికి తాళం వేసి వ్యవసాయ పనులకు వెళ్లే వారికి ఇళ్లను కూడా దొంగలు టార్గెట్ చేసి ఉన్నదంతా అపహరించుకుని వెళ్తున్నారు. రాత్రిపూట పోలీసులు పెట్రోలింగ్, బ్లూ కోర్ట్స్ నిఘా ఉన్నప్పటికీ చోరీలు మాత్రం ఆగడం లేదు. కొన్ని ప్రాంతాల్లో తాళం వేసిన ఇళ్లలో పగటిపూటనే దొంగలు చోరీలకు పాల్పడుతుండడంతో ప్రజలను ఆందోళన కలిగిస్తుంది. దొంగతనం తర్వాత క్లూస్ టీం సహాయంతో నూతన టెక్నాలజీతో, సీసీ కెమెరాలు, వేలిముద్రల ఆధారంగా దొంగలను పట్టుకున్నప్పటికీ బాధితులకు మాత్రం పూర్తిస్థాయిలో సొమ్ము రికవరీ కావడం లేదు. కొన్ని దొంగతనాల కేసులలో దొంగలు క్లూస్ టీంకు ఆధారాలు దొరకకుండా దొంగతనాలకు పాల్పడుతున్నట్లు విచారణలో తేలింది.

గత ఏడాది 709 కేసులు

గత ఏడాది 709 దొంగతనాల కేసులు నమోదైనట్లు గణాంకాలు చెబుతున్నాయి. మొత్తం సొత్తు రూ.3,10,97,968 పోగా, వాటిలో పోలీసులు 40శాతం రికవరీ చేశారు. ఈ ఏడాది ఇప్పటివరకు 86 దొంగ తనాల కేసులు నమోదు కాగా, 66 కేసులలో పోలీసులు నిందితులను అరెస్ట్ చేసి దొంగలు ఎత్తుకెళ్లిన సొత్తు రూ.31,39,050లో రూ.19,06,729 (59.85శాతం) రికవరీ చేశారు.



అప్రమత్తంగా ఉండాలి : సీపీ అనురాధ

అప్రమత్తతోపాటు కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే పూర్తిస్థాయిలో దొంగతనాలు అరికట్టవచ్చునని సిదిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ బి.అనురాధ తెలిపారు. ముఖ్యంగా పోలీసుల సలహాలు, సూచనలు పాటించాలని చెప్పారు.

పోలీసుల సూచనలివే..

- దూర ప్రాంతాలకు వెళ్లేవారు తమ ఇంటి చిరునామా, ఫోన్ నెంబర్‌ను పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చి వెళ్లాలి.
- ఇరుగుపొరుగు వారికి ఇంటిని కనిపెట్టుకోమని చెప్పాలి.
- కాలనీలు, ఇంటి పరిసరాలు, షాపింగ్ మాల్స్‌ల్లో సీసీ కెమెరాలను విధిగా అమర్చుకోవాలి.
- కిటికీల వద్ద ఇంటి తాళాలు పెట్టి నిద్రించకూడదు.
- వేసవిలో కిటికీకు తెరిచి నిద్రిస్తుంటారు. దొంగలు కిటికీల్లో నుంచి నీళ్ల చల్లి బయటకు రాగానే దోచేస్తారు.
- ఇంటి తాళం కనబడకుండా డోర్ కర్టెన్ వేయాలి.
- మహిళలు బయటకు వెళ్లే సమయంలో మెడచుట్టూ కొంగు కప్పుకొని వెళ్లాలి.
- ఊరేళ్తున్నప్పుడు ఇంట్లోని ఒక గదిలో లైటు వేసి ఉంచాలి
- విలువైన వస్తువుల సమాచారాన్ని, వ్యక్తిగత ఆర్థిక విషయాలను ఇతరులకు చెప్పకూడదు.
- తాళం చెవి ఇంటి పరిసర ప్రాంతాల్లో పెట్టకూడదు.
- అపార్ట్మెంట్లలో కాలనీలలో నమ్మకమైన సెక్యూరిటీ గార్డులను, వాచ్‌మన్‌లను నియమించుకోవాలి.
- అనుమానాస్పద వ్యక్తులుంటే స్థానిక పెట్రోలింగ్ పోలీసులకు, పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయాలి.
- ఇంట్లో బంగారు నగలు, నగదు ఉంటే వాటిని బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవడం క్షేమం. లేదా ఎక్కువ రోజులు ఊరేళ్లేవారు వెంట తీసుకెళ్లాలి.
- ఇంటి డోర్‌కు సెంట్రల్ లాకింగ్ సిస్టంను ఏర్పాటు చేసుకోవడం సురక్షితం.
- తమ ప్రాంతంలో గస్తీ ఏర్పాటుకు సహకరించాలి. పోలీసు స్టేషన్ నెంబర్, వీధుల్లో వచ్చే బ్లూ కోల్ట్స్,పెట్రో కార్ పోలీస్ సిబ్బంది నంబర్లను దగ్గర పెట్టుకోవాలి.
- అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే డయల్ 100 లేదా సిద్దిపేట పోలీస్ కంట్రోల్ రూమ్ నంబర్ 8712667100కు సమాచారం అందించాలని సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుంది.

చిన్న గ్రామాల అభివృద్ధి ఎవరికీ పట్టదా?

- ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని మల్లేశంపల్లి, శౌరీపూర్ గ్రామాలు
- ఎన్నికలకు ముందు శంకుస్థాపనలు, భూమిపూజతో సరిపెడుతున్న వైనం
- రెండు గ్రామాల్లో సుమారు రూ.2 కోట్ల విలువ చేసే పనులకు శంకుస్థాపనలు చేసినా కనిపించని పురోగతి
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ చొరవ చూపాలని వేడుకోలు




కంకర తేలిన ముబ్బారస్‌పూర్- శౌరీపూర్ రోడ్డు, పిల్లర్లకే పరిమితమైన మల్లేశంపల్లి పంచాయతీ భవనం



ముబ్బారస్‌పూర్- శౌరీపూర్ రోడ్డు , మల్లేశంపల్లి పంచాయతీ భవనం పనులకు శంకుస్థాపన చేసిన శిలాఫలకాలు

దౌల్తాబాద్, మే 11 (ఆంధ్రజ్యోతి): చిన్న గ్రామాల అభివృద్ధి ఎవరికి పట్టదా అని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గ్రామాల సామాజిక, ఆర్థిక పరిపుష్టి తోనే అభివృద్ధి ఫలాలు సామాన్య ప్రజలకు అందుతా యన్న మహాత్మాగాంధీ మాటలు నాయకులు, ప్రజా ప్రతినిధులకు చెవికెక్కడం లేదని ఆరోపిస్తున్నారు. దౌల్తాబాద్ మండలంలోని మల్లేశంపల్లి, శౌరీపూర్ గ్రామాలే ఇందుకు నిదర్శనమని ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు. సదరు గ్రామాలు రెండింటిని కలిపి గ్రామపంచాయతీగా ఏర్పాటు చేసినప్పటికీ సుమారు రూ.2 కోట్ల విలువ చేసే అభివృద్ధి పనుల పరిస్థితి మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. ఎన్నికలకు ముందు హడావిడిగా శంకుస్థాపనలు, భూమి పూజలకే పరిమితమయ్యా యని గ్రామస్థులు మండిపడుతున్నారు.

ఆగిపోయిన అభివృద్ధి పనుల చిట్టా ఇలా..

దౌల్తాబాద్ మండల పరిధిలోని మల్లేశంపల్లి, శౌరీపూర్ గ్రామాల్లో 2011 జనాభా లెక్కల ప్రకారం 525 మంది ఉన్నారు. 2018లో ఆ రెండు గ్రామాలను కలిపి గ్రామపంచాయతీగా ఏర్పాటు చేశారు. 2020లో దుబ్బాక ఉప ఎన్నికలకు ముందు రూ.20 లక్షల వ్యయం కాగా ఆ గ్రామ పంచాయతీ భవనం నిర్మాణ పనులకు ఆనాటి మెదక్ ఎంపీ, ప్రస్తుత దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అదే విధంగా 2022లో రూ.93.80లక్షల నిధులతో ముబ్బారస్‌పూర్ నుంచి మల్లేశంపల్లి మీదుగా శౌరీపూర్ వరకు రోడ్డు నిర్మాణానికి సైతం నాటి ఎంపీ చేతుల మీదుగా శంకుస్థాపన జరిగింది. 2020లో రూ. 1 కోటీ 80 వేల నిధులతో మల్లేశంపల్లి రోడ్డు పక్కన మంజూరైన 20 డబుల్ బెడురూం ఇళ్ల నిర్మాణానికి మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు శంకుస్థాపన చేశారు. 2019లో దుబ్బాక మాజీ ఎమ్మెల్యే దివంగత సోలిపేట రామలింగారెడ్డి శౌరీపూర్‌లో 40 వేల లీటర్ల సామర్థ్యం గల మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్‌ను రూ.18 లక్షల వ్యయంతో నిర్మించారు. అయితే ఇప్పటి వరకు ఆ గ్రామంలో ట్యాంక్ ద్వారా మిషన్ భగీరథ నీటి సరఫరా జరగకపోవడం గమనార్హం. దీంతో చిన్న గ్రామాలపై ప్రజా ప్రజాప్రతినిధులు, అధికారులకు చిన్న చూపు ఎందుకని ఆయా గ్రామాల ప్రజలు మండిపడుతున్నారు.

అభివృద్ధి చెందుతాయని ఆశించాం



నూతన గ్రామపంచాయతీగా ఏర్పాటైన రెండు గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఆశించాను. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అప్పటి ఎంపీ శంకుస్థాపనలు చేసినా ఆ తర్వాత నిధులు విడుదల చేయలేదు. 20 డబుల్ బెడురూంలు, ముబ్బారస్-శౌరీపూర్ రోడ్డు, గ్రామ పంచాయతీ భవనం లాంటి సౌకర్యాలు లేక మా రెండు గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా మా గ్రామాల్లో శంకుస్థాపనలకే పరిమితమైన అభివృద్ధి పనులను పూర్తి చేసేందుకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ చొరవ చూపాలి.

-దార సత్యనారాయణ, మాజీ సర్పంచ్

కంకర తేలిన రోడ్డుతో అవస్థలు

శౌరీపూర్ నుంచి మల్లేశంపల్లి వరకు రోడ్డు నిర్మాణం లేక అనేక అవస్థలు పడుతున్నాం. బీఆర్ఎస్ ప్రభుత్వంలో మూడేళ్ల క్రితం రూ.93 లక్షల వ్యయం కాగల రోడ్డు నిర్మాణానికి శిలాఫలకాలు వేశారు. ప్రస్తుతం మల్లేశంపల్లి నుంచి శౌరీపూర్ వరకు రోడ్డు కంకర తేలి ప్రమాదకరంగా మారింది. మల్లేశంపల్లి నుంచి శౌరీపూర్ గ్రామానికి రావాలంటే నరకయాతన పడుతున్నాం. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలి

-చెన్న బీమా రాజు, శౌరీపూర్

ఘనంగా దుర్గమ్మ, పెద్దమ్మ దేవతా విగ్రహ ప్రతిష్ట



అమ్మవారి సన్నిధిలో ఎమ్మెల్యే పల్లా, బండా ప్రకాశ్

చేర్యాల, మే 11 (ఆంధ్రజ్యోతి): చేర్యాల మండలం దొమ్మాట గ్రామంలో దుర్గమ్మ, పెద్దమ్మ దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం కార్యక్రమాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. పురోహితులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి దేవతామూర్తులను ప్రతిష్ఠించారు. గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కాగా జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాల అభివృద్ధి, మౌళికవసతుల కల్పనకు సహాయమందిస్తానన్నారు.

పోతరెడ్డిపేటలో ఉచిత వైద్యశిబిరం



శిబిరంలో మహిళకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

మిరుదొడ్డి, మే 11 (ఆంధ్రజ్యోతి): అక్బర్‌పేట-భూంపల్లి మండలం పోతరెడ్డిపేట గ్రామంలో ఆదివారం మాక్స్ ఐకేర్ మల్టిస్పెషాలిటీ ఆసుపత్రి, బాంబే క్లాత్‌హౌజ్ సౌజన్యంతో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరాన్ని దుబ్బాక బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు పాతూరి వెంకటస్వామిగౌడ్ ఆధ్వర్యంలో టీపీసీసీ సభ్యులు సోమేశ్వర్‌రెడ్డి, గాల్‌రెడ్డి, కమలాకర్ ప్రారంభించారు. త్వరలో మండలంలోని అన్ని గ్రామాల్లో కూడా ఉచిత వైద్యశిబిరాలను ఏర్పాటు చేయడానికి కృషిచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, నవీన్, మహిపాల్‌యాదవ్, బాల్‌నర్సు, ఫైమ్మద్, మధు, తరుణ్ ఉన్నారు.

న్యూస్ బాక్స్

బెక్కల్‌లో వ్యక్తి అదృశ్యం



చింతల కిష్టయ్య

దూళిమిట్ట, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బెక్కల్ గ్రామంలో వృద్ధుడు అదృశ్యమయ్యాడు. గ్రామానికి చెందిన చింతల కిష్టయ్య (75) అనే వ్యక్తి ఆదివారం ఉదయం నుంచి కనిపించడం లేదని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు మద్దూర్ ఎస్ఐ మహబూబ్ తెలిపారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే మద్దూర్ పోలీసులకు సమాచారం అందించాలనీ ఓ ప్రకటనలో కోరారు.

పిడుగుపాటుకు గేదె మృతి



మృతి చెందిన గేదెతో బాధిత రైతు

మద్దూరు, మే 11 (ఆంధ్రజ్యోతి) : పిడుగుపాటుతో మద్దూరు మండలం దర్మారం గ్రామానికి చెందిన మానేపల్లి రామచంద్రంకు చెందిన పాడిగేదె మృతి చెందింది. ఆదివారం సాయంత్రం ఎప్పటిలాగే పశువులను పాకలో కట్టేసి ఇంటికి వెళ్లాడు. రాత్రి పిడుగు పడటంతో గేదె మృతి చెందింది. పాడిగేదె మృతితో రూ.65వేల నష్టం వాటిల్లినట్టు బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరుతున్నాడు.

మృతుల కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే పల్లా

చేర్యాల, మే 11 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల పట్టణానికి చెందిన భీమగోని శంకరమ్మ, మేర్గోజు రవీందర్‌చారి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సంతాపం వ్యక్తంచేస్తూ ఆదివారం ఆయా మృతుల కుటుంబాలను పరామర్శించారు.

బీజేపీ చేర్యాల పట్టణ కమిటీ నూతన కార్యవర్గం

చేర్యాల, మే 11 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ చేర్యాల పట్టణ కమిటీ నూతన కార్యవర్గాన్ని ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో అధ్యక్షుడు కర్ర. తిరుపతిరెడ్డి ప్రకటించారు. ఉపాధ్యక్షుడిగా కొట్టె చంద్రమౌళి, వలిమె బాబురావు, మిట్టపల్లి వెంకట్‌రెడ్డి, వలిమె సావిత్రి, ప్రధాన కార్యదర్శులుగా పంగ సిద్దులు, కలకుంట్ల మనీశ్, కార్యదర్శులుగా తుప్పతి రమేశ్, వెలుగల వినయ్, పంగ ప్రదీప, బి. పద్మ, కోశాధికారిగా తడక లక్ష్మణ్‌తో పాటు పలువురు సభ్యులుగా నియామకమయ్యారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కరపత్రం ఆవిష్కరణ

మద్దూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సలాఖ్‌పూర్‌లో గ్రామ అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో విగ్రహావిష్కరణ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ సంఘం ప్రతినిధులు ఎర్ర మల్లేశం, సీమోన్, మనోహర్, కరుణాకర్, మల్లేశం, రవి, బిక్షపతి, స్వామి, ఆశీర్వాదం, గడిపె అనిల్‌కుమార్ మాట్లాడారు. ఈ నెల 15న డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

అందుబాటులోకి ఇంటర్ ఒకేషనల్ కోర్సులు

- రాయపోల్ కేజీబీవీకి 2 కోర్సులు



రాయపోల్‌లో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ భవనం

రాయపోల్, మే 11 (ఆంధ్రజ్యోతి): రాయపోల్ మండల కేంద్రంగా ఏర్పడి ఎనిమిదేళ్లు దాటినా ఇప్పటివరకు జూనియర్ కళాశాల మంజూరు కాలేదు. దీంతో పలువురు బాలికలు పదో తరగతి పూర్తయిన తర్వాత చదువుకు దూరమయ్యే పరిస్థితి నెలకొన్నది. ఈ క్రమంలో ఇటీవల ప్రభుత్వం రాయపోల్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయానికి రెండు ఒకేషనల్ కోర్సులను మంజూరు చేసింది. ఈ సంవత్సరమే ఇంటర్ ఒకేషనల్ క్లాసులు ప్రారంభం కానున్నాయి. ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సులో 40 సీట్లు, ఎమ్మెల్టీ కోర్సులో 40 సీట్లు భర్తీ చేయనున్నారు. ఒకేషనల్ కోర్సుల్లో చేరేందుకు ఆసక్తి ఉన్న అభ్యర్థులు రాయపోల్‌లోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో సంప్రదించాలని అధికారులు పేర్కొన్నారు.

గదుల కొరతే సమస్య

రాయపోల్‌లోని కేజీబీవీ పాఠశాల అద్దె భవనంలో కొనసాగుతున్నది. ఈ భవనంలో ఉన్న గదుల్లో ఐదింటిని తరగతి గదులుగా, ఒక గదిని కార్యాలయంగా, ఒక గదిని స్టాక్ రూంగా, ఒక గది సిక్ రూమ్, ఒక గది స్టోర్ రూమ్, ఒక గది కిచెన్‌గా వినియోగించుకుంటున్నారు. ఇందులోనే ఇంటర్మీడియట్ ఒకేషనల్ కోర్సులు ప్రారంభించాలంటే కనీసం మరో అయిదు గదులు అవసరమవుతాయి. తరగతులకు రెండు గదులు, ల్యాబ్‌లకు రెండుగదులు, సిబ్బందికి ఒక గది కావాల్సి ఉంటుంది. మరికొన్ని గదులను అద్దెకు తీసుకుంటే తప్ప ఇంటర్ కోర్సుల నిర్వహణ సజావుగా సాగేలా లేదు. రాయపోల్ కేజీబీవీకి ప్రభుత్వ భవనం మంజూరు చేసి ఏళ్లు గడుస్తున్నా నిర్మాణం నత్తనడకన సాగుతున్నది. ఈ భవన నిర్మాణం పూర్తయ్యే వరకూ విద్యార్థులు, అధ్యాపకులకు ఇబ్బందులు తప్పేలా లేవు.

యువతను ప్రోత్సహించేందుకే క్రికెట్ టోర్నమెంట్



మర్కుక్, గంగాపూర్ క్రికెట్ జట్ల మధ్య టాస్ వేస్తున్న డీసీసీబీ ఉమ్మడి జిల్లా డైరెక్టర్ అంజిరెడ్డి

మర్కుక్, మే 11 (ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసికోల్లాసానికి ఎంతగానో దోహదపడతాయని డీసీసీబీ ఉమ్మడి మెదక్ జిల్లా డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి అన్నారు. మర్కుక్ మండల పరిధిలోని ఎర్రవల్లి గ్రామంలో వేసవి సెలవుల సందర్భంగా ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌కు మండల మాజీ ఎంపీపీ పాండుగౌడ్, మాజీ జడ్పీటీసీ మంగమ్మ రామచంద్రం, ప్యాక్స్ వైస్ చైర్మన్ కమ్మరి బాలరాజుతో కలిసి హాజరై టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలేజీలకు వేసవి సెలవులు వచ్చిన సందర్భంగా విద్యార్థులు అనవసర వ్యసనాల బారిన పడకుండా క్రీడలపై దృష్టి మళ్లించాలని కోరారు. ఈ క్రమంలో యువత కోసమే ఈ క్రికెట్ టోర్నమెంట్ ఏర్పాటు చేశామన్నారు. అనంతరం భారత్-పాక్‌ల యుద్ధంలో ప్రత్యక్షంగా పాల్గొని తాత్కాలికంగా యుద్ధం నిలిపివేయడంతో సొంత గ్రామానికి వచ్చిన జవాన్ నరేష్‌సింగ్‌ను ఘనంగా సన్మానించారు. వీర మరణం పొందిన జవానులకు నివాళులర్పిస్తూ మౌనం పాటించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ధనలక్ష్మీ కృష్ణ, మర్కుక్ సర్పంచ్ అచ్చంగారి భాస్కర్, కబడ్డీ క్లబ్ అధ్యక్షుడు కృష్ణ, గ్రామ పెద్దలు గీసు మల్లేశం, పరశురాం, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

రేబర్తిలో ముమ్మరంగా బడిబాట



రేబర్తిలో ఇంటింటికి తిరుగుతూ తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

మద్దూరు, మే 11 (ఆంధ్రజ్యోతి) : మద్దూరు మండలంలోని రేబర్తి ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో ఆదివారం బడిబాట కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు ముమ్మరం చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరుగుతూ డ్రాపవుట్ విద్యార్థులను, ప్రైవేటు పాఠశాలలకు వెళ్లే విద్యార్థులను గుర్తించి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేందుకు కృషి చేశారు. ఉపాధ్యాయులు బాకీ చంద్రభాను, సంపత్ కుమార్, ఎండీ రఫత్ ఉమర్, ప్రశాంత్ తల్లిదండ్రులతో మాట్లాడి ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని తెలిపి పాఠశాలలకు పంపించే విధంగా వారి నుంచి హామీ తీసుకున్నారు.

వేణుగోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు



గరుడ కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు

వర్గల్, మే 11 (ఆంధ్రజ్యోతి) : వర్గల్ మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రెండో రోజు ఆలయం వద్ద ధ్వజారోహణం నిర్వహించారు. ఆలయ వేద పండితులు వేదాంతం మురళీధర చార్యుల నేతృత్వంలో రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం ధ్వజారోహణం, గరుడ కల్యాణం, యాగశాలలో సుదర్శన హోమం చేశారు.

చెత్తతో సంపద

(5వ పేజీ తరువాయి)

ఎరువులుగా మార్చే విధంగా చర్యలు చేపడుతున్నారు. ఈ ఎరువులను నర్సరీలకు, రైతులకు అమ్మి గ్రామ పంచాయతీలకు ఆదాయం సమకూర్చేందుకు చర్యలు చేపట్టారు.

చెత్తతో ఆదాయం.. విజయవంతమయ్యేనా?

గ్రామ పంచాయతీలో నిధులు లేక పారిశుధ్య కార్మికులకు కనీసం వేతనాలు కూడా ఇచ్చే పరిస్థితి లేదు. ట్రాక్టర్లు మూలనపడ్డాయి. చాలా చోట్ల పంచాయతీల నిర్వహణకు కార్యదర్శులే అప్పు చేస్తున్నారు. ఈ ఎరువుల తయారీ ఆలోచన గతంలోనూ ఉన్నదే. అందు కోసం సెగ్రిగేషన్ షెడ్డులను సైతం అప్పట్లో నిర్మించారు. కానీ మళ్లీ వాటినే ఎరువుల తయారీ కేంద్రాలను మార్చి ఆదాయం వచ్చేలా చేయడంలో ఎంతవరకు విజయవంతం అవుతారో చూడాలి. ప్రస్తుతం చెత్తతో ఎరువుల తయారీ, విక్రయ వ్యాపారంతో తమకు అదనపు భారం తప్పదని కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నేడు శ్రీ కృష్ణ భగవాన్- రుక్మిణీ కల్యాణం



స్వామివారి మంగళస్నానాల కార్యక్రమంలో భక్తులు

తొగుట, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకట్రావ్‌పేట గ్రామంలోని వేణుగోపాల స్వామి ఆలయంలో సోమవారం శ్రీకృష్ణభగవాన్-రుక్మిణి అమ్మవార్ల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు జీడికంటి రాజు ఆచార్యులు తెలిపారు. ఆదివారం ఆలయంలో శ్రీకృష్ణభగవాన్- రుక్మిణి అమ్మవార్లకు మంగళస్నానాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మాట్లాడుతూ.. స్వామివారి కల్యాణోత్సవాన్ని ఉదయం 11 నుంచి 12.30గంటల వరకు జరుగుతుందని తెలిపారు. 13న సామూహిక సత్యనారాయణ వ్రతంతో పాటు, అఖండ భజన, అన్నదాన కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

ఘనంగా లక్ష్మీనృసింహస్వామి కల్యాణం



లక్ష్మీనృసింహుల కల్యాణోత్సవంలో భక్తులు

చేర్యాల, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరన్నపేట గ్రామంలో లక్ష్మీనృసింహస్వామి ఆలయ వార్షిక బ్రహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గ్రామం లక్ష్మీనృసింహుడి నామస్మరణతో మార్మోగింది. ఉదయం ఆలయంలో విశేషపూజల అనంతరం దేవతామూర్తులకు పట్టు వస్త్రాలు, ఆభరణాలు అలంకరింపచేసి అర్చకులు శాస్త్రోక్తయుక్తంగా స్వామివారి కల్యాణం నిర్వహించారు. అనంతరం దేవతామూర్తులను ఊరేగింపు జరిపారు.

కూడవెల్లి రామలింగేశ్వరాలయంలో పూజలు



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు

దుబ్బాక/మిరుదొడ్డి, మే 11(ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్‌పై భారత్ విషయాన్ని సాధించాలంటూ కూడవెల్లి రామలింగేశ్వరాలయ చైర్మన్ ఉషయ్యగారి రాజిరెడ్డి అన్నారు. ఆదివారం సిందూర్-2 ఆపరేషన్ విజయవంతంగా పూర్తికావాలని కోరుకుంటూ ఆలయంలో మన్యుసూక్త పారాయణం, పూజలను నిర్వహించారు.

ఘనంగా పోశమ్మ ఆలయ వార్షికోత్సవం

మిరుదొడ్డి, మే 11(ఆంధ్రజ్యోతి): మిరుదొడ్డిలో బాబుజగ్జీవన్ రామ్ యువజనసంఘం ఆధ్వర్యంలో ఆదివారం పోశమ్మ ఆలయం 8వవార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. మహిళలు ప్రధాన వీధులగుండా అమ్మవారికి బోనాలను ఊరేగించి మొక్కులు చెల్లించుకున్నారు.

సీపీఐతోనే ప్రజాసమస్యల పరిష్కారం



ఆకునూరులో పార్టీ జెండాను ఎగరేస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి పవన్

చేర్యాల, మే 11 (ఆంధ్రజ్యోతి) : త్యాగాల చరిత్ర కలిగిన సీపీఐతోనే ప్రజాసమస్యలు పరిష్కారమవుతాయని ఆ పార్టీ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్ పేర్కొన్నారు. చేర్యాల మండలం ఆకునూరు గ్రామంలో ఆదివారం సీపీఐ గ్రామశాఖ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రధానవీధులగుండా ర్యాలీ నిర్వహించి పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం సభలో ఆయన మాట్లాడుతూ.. కేంద్రప్రభుత్వం తీసుకువచ్చిన కార్మిక చట్టాల రద్దుకు ఉద్యమిస్తున్నామని పునరుద్ఘాటించారు. కేంద్రప్రభుత్వం అమలుచేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై అలుపెరగని పోరాటాలకు ప్రజలు కలిసిరావాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి అందె అశోక్, నాయకులు ఈరు భూమయ్య, కత్తుల భాస్కర్‌రెడ్డి, నంగి కనకయ్య, నంగి సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నంగునూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): నంగునూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎస్సెస్సీ 2001-02 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమావేశం జరుపుకుని సందడి చేశారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పరస్పరం ఆత్మీయంగా పలకరించుకుంటూ కుటుంబ క్షేమ సమాచారాలను పంచుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు వెంకటేశ్వరరెడ్డి, నరసింహారెడ్డి, కనకయ్య, ప్రస్తుత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామస్వామి గౌడ్‌ను సత్కరించారు.

నిరుపేద కుటుంబానికి అండగా చెలిమి ఫౌండేషన్



ఆర్థికసాయం అందజేస్తున్న చెలిమి ఫౌండేషన్ సభ్యులు

వర్గల్, మే 11 (ఆంధ్రజ్యోతి) : వర్గల్ మండలం చౌదరిపల్లి గ్రామానికి చెందిన చింత వెంకటేశం రెండు నెలల క్రితం మృతి చెందడమైంది. అతనికి భార్య రమ్య, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. ఆదివారం చెలిమి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మృతుడు వెంకటేశం కుటుంబానికి రూ. 3500 విలువ చేసే నిత్యావసర సరుకులు, రూ. 11,500ను ఫౌండేషన్ అధ్యక్షుడు మంగిలిపల్లి కిరణ్‌కుమార్ అందజేశారు.. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు చేపూరి సంతోష్, దొంతుల ఆనంద్, గుంటుక శ్రీనివాస్, టెంటు నర్సింలు, ఇబ్రహీం, నాగపూరి రమేశ్, గుర్రం తులసి దాస్, పిట్ల అంజనేయులు, జూపల్లి బాలకుమార్ తదితరులు ఉన్నారు.

పేద కుటుంబానికి అండగా ఆపన్నహస్తం



కనకయ్య కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న మిత్రబృందం

ములుగు, మే 11 (ఆంధ్రజ్యోతి): ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పేద కుటుంబానికి ఆపన్నహస్తం మిత్ర బృందం అండగా నిలిచింది. ఇటీవల మండలంలోని ఆర్ఆర్ కాలనీ తానేదార్‌పల్లి గ్రామానికి చెందిన జామకాయల కనకయ్య మృతి చెందగా భార్య, పిల్లలు అనాథలుగా మారారు. భార్య పుణ్యవతి మానసిక ఆరోగ్యం సరిగా లేక మంచాన పడ్డది. కూతురు కాలేజీకి వెళ్తూ, తల్లిని చూసుకుంటూ కుటుంబాన్ని నెట్టుకొస్తుంది. మాతృ దినోత్సవం సందర్భంగా ఆదివారం నిరుపేద మాతృమూర్తి కుటుంబానికి రూ.20వేలను అందజేశామని స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు బాలచంద్రం తెలిపారు.